## కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సోగ్రాభీ, అక్బర్

కోరుట్ల, నవంబర్ 18: పట్టణానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ ఉపాధ్యక్షురాలు సోగ్రాభీ, ఆమె తనయుడు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్ అక్బర్ శనివారం కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఈసందర్భంగా తమ రాజీనామా లేఖను కొరియర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి పంపించారు. కాంగ్రెస్‌లో మైనార్టీలను చిన్న చూపు చూస్తున్నారని, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక సరిగా జరుగలేదని, ప్రజల కోసం కాకుండా స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలో చేరిన వారికి టికెట్లు కేటాయించారని ఆరోపించారు. అందుకు నిరసనగానే కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. పార్టీ పదవితో పాటూ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోగ్రాబీ, అక్బర్ వెల్లడించారు.

## జగ్గసాగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 18: జగ్గసాగర్ గ్రామ శివారులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం వేకువజాము జగ్గసాగర్ శివారులోని షిర్డీ సాయిబాబా ఆలయంలోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించారు. ఆలయంలో గల హుండీని పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. హుండీలో సుమారు రూ.10 వేల వరకు భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

## గోశాలకు పశుగ్రాసం అందజేత

మారుతీనగర్, నవంబర్ 18: పట్టణ శివారులోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలకు కార్తీక మాసం సందర్భంగా భక్తులు శనివారం పశుగ్రాసాన్ని విరాళంగా అందజేశారు. వేద పండితులు మదన్‌శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలకు వివిధ గ్రామాలకు చెందిన పలువురు భక్తులు సుమారు రెండు ట్రాక్టర్ల గడ్డికట్టలను అందజేయగా గోశాల అభివృద్ధికి నగదు విరాళంగా అందజేశారు.

## త్రిశక్తీ అమ్మవారికి నెక్లెస్ బహుకరణ

కోరుట్ల, నవంబర్ 18: పట్టణంలోని త్రిశక్తీ ఆలయంలో కొలువుదీరిన దుర్గా అమ్మవారికి నిజామాబాద్‌కు చెందిన ఆదిత్య విశ్వనాథ్ – ప్రసూన దంపతులు శనివారం 10 గ్రాముల బంగారు నెక్లెస్ బహూరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక్కడ గణేశ్ నవదుర్గా మండలి గౌరవాధ్యక్షుడు కట్ట నారాయణ, అధ్యక్షుడు కటుకం గణేశ్ తదితరులున్నారు.

## పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల పర్యవేక్షకులు

కోరుట్ల, నవంబర్ 18: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఎన్నికల పర్యవేక్షకుడు రాజీవ్ రంజిత్ మీనన్ ఆధ్వర్యంలో ఈవీఎంల కేటాయింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఈవీఎంల కేటాయింపునకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక నంబర్లను ముద్రించారు. ఈవీఎంల పనితీరుపై మాక్ పోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల పర్యవేక్షకులు తెలిపారు. ఇక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్, బీఎల్‌వోలున్నారు.

## మద్యం పట్టివేత

మెట్‌పల్లి, నవంబర్ 18 : వెల్లుల్ల రోడ్డులో శనివారం వాహన తనిఖీల్లో పోలీసులు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. తనిఖీల్లో రూ.20,500 విలువ చేసే 60 లీటర్ల లిక్కర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్, నవంబర్ 18: మొగిలిపేట గ్రామానికి చెందిన దండవేని ధర్మరాజు(43) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా ధర్మరాజ్ షుగర్ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. పలు దవాఖానలు తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర అనారోగ్యం భరించలేక జీవితంపై విరక్తి చెంది కొట్టంలో ఉరేసుకొన్నాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మవద్దు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- కాంగ్రెస్ నాయకుల చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం



కోరుట్లలో కాంగ్రెస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సోగ్రా బీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల, నవంబర్ 18: మైనార్టీలకు రక్షణ కల్పించేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటు వృథా చేసుకోవద్దని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని గంగంపేటలో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సోగ్రాభీ, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్బర్ బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పిన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే తెల్ల రేషన్ కార్డుదారులందరికి సన్న బియ్యం అందిస్తుందన్నారు. భూమి లేని నిరుపేదలకు పట్టణ శివారు జంబిగద్దె సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఇండ్లు కట్టించి ఇస్తామని పేర్కొన్నారు. గృహలక్ష్మీ పథకం ద్వారా సొంత స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తామన్నారు. పీఎఫ్ కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. కేసీఆర్ రక్ష పథకం ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమం కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా బడ్జెట్‌లో రూ.12 వేల కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు. మైనార్టీలకు షాదీ ముబారక్ పథకం ద్వారా రూ. లక్ష నూటపదహార్లు, రంజాన్ కిట్ తోఫా, మహిళలకు కుట్టుమిషన్లు, మసీదుల అభివృద్ధికి నిధుల కేటాయింపు, మైనార్టీ బంధు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించారని గుర్తు చేశారు. ఇన్ని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మైనార్టీలు మద్దతుగా నిలువాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు, గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి ఆగం కావద్దని, స్థానికుడు, మీకు ఎల్లవేళాల అందుబాటులో ఉండే డాక్టర్ సంజయ్ కల్వకుంటను కారు గుర్తుకు ఓటు వేసి దీవించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం సుమారు 100 మంది కాలనీవాసులు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫహీం, మైనార్టీ నాయకుడు నయీం, నాయకులు సజ్జు, బాబా, రహీం, అతిక్, సనావొద్దీన్, జాల వినోద్ కుమార్, చిత్తారి ఆనంద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి : ప్రచారం చేస్తున్న కల్వకుంట్ల సరోజన, బీఆర్ఎస్ శ్రేణులు



కోరుట్ల: మహిళకు మ్యానిఫెస్టో పత్రాన్ని అందిస్తున్న సంజయ్ సతీమణి కల్వకుంట్ల దీప్తి

# స్థానికుడికే అవకాశమివ్వండి

- ప్రజలు బీజేపీ, కాంగ్రెసోళ్ల మాటలు నమ్మవద్దు
- కారు గుర్తుకు ఓటెయ్యండి
- బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం



కోరుట్ల రూరల్: మాదాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ

మెట్‌పల్లి, నవంబర్ 18: ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తల్లి సరోజన అన్నారు. శనివారం పట్టణంలోని 6వ వార్డులో కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, తన కొడుకు సంజయ్ కల్వకుంట్లకు మద్దతుగా ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అంతా దరిద్రమేనని, తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ ఎట్లుండే, రాష్ట్రం వచ్చినంక ఎట్లయింది అని ఆలోచించాలని, పని చేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలని, బీఆర్ఎస్ పాలనతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఇంటింటా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఆమెవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కౌన్సిలర్లు బంగారుకాళ్ల కిశోర్, ఎనగందుల వనజ, కో ఆప్షన్ సభ్యుడు గైని లావణ్య, నాయకులు రాయల్ నాయక్, ఎనగందుల శ్రీనివాస్‌గౌడ్, ద్యావతి అరుణ, జరుపుల భారతి, ద్యావతి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కల్వకుంట్ల దీప్తి ఎన్నికల ప్రచారం

కోరుట్ల, నవంబర్ 18: పట్టణంలోని 12వ వార్డు భీమునిదుబ్బ, ప్రకాశం రోడ్డులో శనివారం కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సతీమణి కల్వకుంట్ల దీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మళ్లీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల తీరును వివరించారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటెయ్యాలని దీప్తి కోరారు. ఇక్కడ కౌన్సిలర్ ఆడెపు కమల, మాజీ కౌన్సిలర్ గంద్ర శిల్పారావు, నాయకుడు బర్ల ప్రభాకర్, తదితరులున్నారు.

### మాదాపూర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు

కోరుట్ల రూరల్, నవంబర్ 18 : మండలంలోని మాదాపూర్ గ్రామంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ, మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్‌ఎంపీపీ చీటి స్వరూప, సహకార సంఘాల అధ్యక్షులు గడ్డం ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులు పడాల లచ్చన్న, ఎంపీటీసీ సభ్యులు చేపూరి కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ గడ్డం మల్లారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.